ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 08
సంచిక : 68
పేజీలు : 3
బుధవారం, అక్టోబర్ 08, 2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## రూ. 10 కోట్లు ఎగ్గొట్టిన వడ్డీ వ్యాపారి

**ఇంటికి నిప్పు పెట్టిన బాధితులు**



**టి మీడియా, అక్టోబర్ 7, నల్లగొండ :** నిరుపేదలకు అధిక వడ్డీ ఆశజూపి కోట్లు కొల్లగొట్టి తప్పించుకు తిరుగుతున్న వడ్డీ వ్యాపారి ఇంటిపై బాధితులు దాడికి పాల్పడ్డారు. ఆ వడ్డీ వ్యాపారి ఇంటికి ఏకంగా నిప్పు పెట్టారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని పడమటి తండాలో వెలుగు చూసింది.పెద్ద అడిశర్లపల్లి మండలంలోని పడమటి తండాకు చెందిన బాలాజీ నాయక్ అనే వ్యక్తి ఇటీవల అధిక వడ్డీల ఆశ చూపి.. రూ. 10 కోట్ల వరకు వసూలు చేశాడు. ఆ తర్వాత డబ్బులు

మిగతా 2లో



### రోగనిర్ధారణ నిషేధ చట్టం

## కట్టుదిట్టంగా అమలు...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- పి.సి.పి.ఎన్.డి.టి. యాక్ట్ సమావేశం

**టీ మీడియా ,అక్టోబర్7,ఖమ్మం:**గర్భధారణకు ముందు మరియు గర్భధారణ సమయంలో రోగనిర్ధారణ పద్ధతుల నిషేధ చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ లో మంగళవారం నిర్వహించిన గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం%-%1994 పరిధి జిల్లా అడ్వైజరి కమిటి సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర రావు, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఫర్టిలిటీ సెంటర్ లలో చికిత్సకు అయ్యే ఖర్చు నియంత్రణ, రేట్ కార్డు ప్రదర్శన జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ప్రసూతి ఆసుపత్రిలో ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా పి.సి.పి.ఎన్.డి.టి. యాక్ట్ పై బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు.చిన్నపిల్లల దత్తత కోసం సమాజంలో భారీ డిమాండ్ ఉందని, అనవసరంగా పిల్లలను చంపే సంస్కృతి పోవాలని, పుట్టిన తర్వాత దత్తత ఇచ్చేందుకు గల అవకాశాల గురించి కూడా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు.ఖమ్మం జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలలో జరిగే ప్రతి స్కానింగ్ కు సంబంధించి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు. జిల్లాలో రిజిస్టర్ కాని స్కానింగ్ కేంద్రాలు ఎక్కడైనా ఉన్నాయో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో జరిగే ప్రసవాలలో వెయ్యి మంది మగ పిల్లలకు 946 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి,చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం జైలు శిక్ష, జరిమానవిధించబడుతుందని, అలాగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లింగ నిర్ధారణ అరికట్టుటకు ప్రతి నెల స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని, జిల్లాలోని ఆసుపత్రులలో జరుగుతున్న అబార్షన్ కేసులను సైతం స్టడీ చేసి ఎక్కడైనా లింగ నిర్ధారణ కారణంగా అబార్షన్ జరిగిందా అని పరిశీలించాలని తెలిపారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు లింగ నిర్ధారణ చేయకుండా ఉండే విధంగా

మిగతా 2లో



## ఇదేం ఇందిరమ్మ ఇల్లు..?

- 8 పిల్లర్లతో నిర్మాణం
- రోడ్డును ఆక్రమణ
- కోర్టు ఆదేశాలు

లెక్కలేవు..

**టి మీడియా, అక్టోబర్ 7, ఖమ్మం బ్యూరో:** అభివృద్ధి ప్రదాత అని ప్రజలు ఇచ్చిన బిరుదాంకితుడు తుమ్మల నాగేశ్వరరావు నగర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నప్పటికీ, మరో వైపు అక్రమార్కులు రెచ్చిపోతున్నారని సమాచారం. అధికారులు మాత్రం ఆలోచనాత్మక దృష్టి చూపడంలేదు.వివరాలు పరిశీలన చేయగా ఖమ్మం నగరం, రామాలయం వీధిలోని ఇంటి నంబర్ 9-10-95కి 'ఇందిరమ్మ ఇల్లు' మంజూరు అయింది. అర్హత మేరకు మంజూరు ఇచ్చారు. అయినప్పటికీ, ఆ స్థలం ఇప్పటికే కోర్టు పరిధిలో ఉంది. ఇటీవలి తీర్పు ప్రకారం, ఆ స్థలంలో నిర్మాణం చేయవద్దని 'అంజాద్' అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ వేసి తీర్పు పొందాడు. ఆదేశాలు మున్సిపల్ అధికారులకు అందాయి, అయినా అమలు కాలేదు.

ఇది ఒక భాగం మాత్రమే, ఒక నిర్మాణం చేయాలంటే, 'ఇందిరమ్మ ఇల్లు' అయినా మున్సిపల్ నిబంధనల ప్రకారం ముందు , వెనుక భాగాలను వదలాలి. ఎటువంటి లేకుండా, మున్సిపల్ రికార్డులో ఉన్న గల్లీని కూడా ఆక్రమించి నిర్మాణ పనులు చేస్తున్నారు.

**8 పిల్లర్లు**

అసలు ఇరుకుగా గల్లీ, ఆపై 100 గజాలు లోపు స్థలం, 'ఇందిరమ్మ ఇల్లు'ను 8 పిల్లర్లతో నిర్మించడం అనుమానం కలిగిస్తోంది. 'ఇందిరమ్మ' హౌసింగ్ కొలతలతో నిర్మాణం చేసి స్లాబ్ వేసి%ా% బిల్లులు రాగానే అంతస్తులు తో భారీ నిర్మాణం చేయడానికి బిల్డర్‌తో వప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది.రాజకీయ పలుకు బడి ఉన్న ఆ బిల్డర్ వత్తిడితో పిల్లర్ల నిర్మాణం, రోడ్డును ఆక్రమణ చేస్తున్నారని తెలుస్తోంది. కోర్టు ఆదేశాలు అమలు కాకుండా బిల్డర్ అధికారులపై వత్తిడి వచ్చినట్లు సమాచారం.మొత్తం మీద, మున్సిపల్‌లో కొంతమంది అక్రమార్కుల వ్యవహారాల పరాకాష్ట స్పష్టంగా కనిపిస్తోంది.

## ఏటీసీ కేంద్రాల పనుల పురోగతి పరిశీలించిన కలెక్టర్

**టీ మీడియా ,అక్టోబర్7,భద్రాద్రి కొత్తగూడెం:** రుద్రంపూర్ మణుగూరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ)లో జరుగుతున్న పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వివిధ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల పురోగతి, ల్యాబ్ ఏర్పాట్లు, పరికరాల సరఫరా, విద్యార్థుల శిక్షణ కోసం ఏర్పాట్లు, అవసరమైన మౌలిక సదుపాయాల స్థితిని విపులంగా పరిశీలించారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏటీసీ కేంద్రాలు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంలో కీలకంగా ఉంటాయని, యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఏ టి సి కేంద్రాల ద్వారా సాంకేతిక శిక్షణ పొందిన యువత తక్షణ ఉద్యోగ అవకాశాలు పొందగలుగుతారని, స్థానిక పరిశ్రమల అభివృద్ధికి కూడా దోహదపడతాయని స్పష్టంచేశారు. రుద్రంపూర్ ఏటీసీ కేంద్రంలో నిర్మాణ పనులు, ల్యాబ్ పరికరాల ఏర్పాటు, విద్యార్థుల శిక్షణ సదుపాయాల ఏర్పాట్ల పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. మణుగూరు కేంద్రంలో సాంకేతిక ల్యాబ్ ఏర్పాటు, కంప్యూటర్ మరియు సిమ్యులేషన్ పరికరాల సరఫరా, శిక్షణ కోసం ప్రణాళికలను అధికారులు వివరించారు.కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను పనులు వేగవంతం చేయాలని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పూర్తి చేయాలని ఆదేశించారు. పనులలో ఏవైనా ఆలస్యాలు జరగకుండా, సమన్వయంతో ముందుకు సాగించేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు . అవసరమైన సవరణలు తక్షణమే చేయాలని, కేంద్రాలు విద్యార్థుల



శిక్షణ కోసం పూర్తిగా సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట రామవరం ఐటిఐ ప్రిన్సిపల్ రమేష్, మణుగూరు ఐటిఐ ప్రిన్సిపల్ ప్రభాకర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### మహనీయుల జీవితాలను

## ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**టీ మీడియా అక్టోబర్ 7 ,ఖమ్మం:** మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి,

మిగతా 2లో

# సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై అవగాహన

**టీ మీడియా ,అక్టోబర్7,చింతూరు:**
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం మరియు అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో లి"సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్న మాణిక్యం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జీఎస్టీ పరిశీలకులుగా నియమించబడిన ఎస్.అమరేశ్వర రావు %-% చింతూరు, ఆర్. సుబ్బారెడ్డి %-% మారేడుమిల్లి, కేస్.వి.ఏ.ఎస్.ఆనంద్ %-% ఎటపాక, బి.సత్యనారాయణ %-% వి.ఆర్.పురం మండలాలకు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.కలెక్టరేట్ వారి ఆదేశాల మేరకు పన్నుల వ్యవస్థలో పౌరుల పాత్ర, జీఎస్టీ యొక్క ఆవశ్యకతను గురించి విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. దేశా అభివృద్ధికి పన్నుల చెల్లింపు ఎంత కీలకమో తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినీ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణల వలన వినియోగదారులకు కలిగే ప్రయోజనాలను, జీఎస్టీ 2.0లో వివిధ స్లాబ్స్, వస్తు, సేవల పన్ను రేట్లు, ప్రభుత్వం భరించే ఆర్థిక భారం,వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్లు, ఉపాధి కల్పన మొదలగు అంశాలపై విశ్లేషణాత్మకంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి జి.హారతి మాట్లాడుతూ జీఎస్టీ 2.0 వ్యవస్థలో వచ్చిన కొత్త నిబంధనలు, సాంకేతిక మార్పులు, వ్యాపార రంగంపై వాటి ప్రభావం గురించి వివరించారు.అర్థశాస్త్ర విభాగాధిపతి జి.వెంకట్రావు మాట్లాడుతూ జీఎస్టీ 2.0 తగ్గింపు పై



వినియోగదారులకు లభించే విస్తృత ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం లి"జీఎస్టీ 2.0 సంస్కరణలు %-%వినియోగదారులకు కలిగే ప్రయోజనాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## చీడపీడల నివారణ చర్యలు

**టీ మీడియా, అక్టోబర్ 7, ముదిగొండ**
వల్లాపురం గ్రామంలో వరి పొలాలను కెవికె వైరా శాస్త్రవేత్తలు పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు తాటికొండ రమేష్ వరి పొలంలో సుడిదోమ, బ్యాక్టీరియా తెగులు ఎండు తెగులు, ఆకు ముడతను శాస్త్రవేత్తలు గుర్తించారు. వరి పొలాలకు సోకుతున్న చీడపీడల నుంచి నివారణ చర్యలు ఏ విధంగా చేపట్టాలో రైతులకు శాస్త్రవేత్తలు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సరిత, శాస్త్రవేత్తలు డాక్టర్ సుచరిత దేవి, పావని, చైతన్య, పోనీ శ్రీ, రైతులు పాల్గొన్నారు.

### రూ. 10 కోట్లు ఎగ్గొట్టిన వడ్డీ వ్యాపారి

తిరిగి ఇవ్వమని కోరగా, తప్పించుకు తిరుగుతున్నాడు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు.. బాలాజీ నాయక్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు.ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి తగులబెట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాలాజీ నాయక్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

### మహనీయుల జీవితాలను

జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మహాకవి వాల్మీకిఆధ్యాత్మికవేత్తగా రామాయణ కావ్యం రచించి ఆదికవిగా వెలుగొందారని, రామాయణం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని అన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు. ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని జరుపు కోవడం సంతోషకరమని తెలిపారు. అనంతరం వక్తలు మహర్షీ వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**-మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డిఎంహెచ్ఓ**

**టీ మీడియా,అక్టోబర్ 7, కామేపల్లి:**
ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ కళావతి భాయి, భద్రాచలం ఐటీడీఏ అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సైదులు పిలుపు నిచ్చారు.కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయల్లో ఖర్చు చేస్తుందని వివిధ రకాల జబ్బులకు చికిత్స చేసే స్పెషలిస్ట్ వైద్యులను ప్రభుత్వ ఆసుపత్రుల లో నియమించిందని అన్ని రకాల మందులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ వైద్యుల వద్దకు వెళ్లి డబ్బులు వృధా చేసుకోవద్దని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నాటు వైద్యులను ఆశ్రయించి తమ ఆరోగ్యాన్ని ఖరాబ్ చేసుకోని ఇబ్బందులు పడవద్దని సూచించారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రసన్న జ్యోతి, డెర్మాటాజిస్ట్ డాక్టర్ అమీనాజ్, ఇతర స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ నిరోషా, డాక్టర్ రాజశేఖర్ డాక్టర్ అభిలాష్ రెడ్డి డాక్టర్ జై కీర్తి సుమారు 400 మంది ప్రజలకు వివిధ రకాల పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించారు. ఆపరేషన్ అవసరమైన వారు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఎన్.చందన, డాక్టర్ శిరీష, భద్రాచలం ఐటిడిఏ డీపీఎంఓ శ్రీనివాసరావు, హెచ్ ఈ ఓ లింగం నాయక్, హెచ్ ఓ కే వెంకటేశ్వర్లు, సూపర్వైజర్లు



నరేంద్రనాయక్, రాధాకృష్ణ, ఎం లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, మల్లికార్జున్, రాంబాబు, ఎల్ టి ఉమామహేశ్వరరావు, స్టాఫ్ నర్స్ పుష్పలత, ఏఎన్ఎంలు రమణ, అరుణ ,రమాదేవి, మీనా, హేమలత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రోగనిర్ధారణ నిషేధ చట్టం

చట్టం పై పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. ఆసుపత్రుల అనుమతి జారీ చేసే సమయంలో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యం వంటి అంశాలను పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. చంద్రశేఖర రావు మాట్లాడుతూలి పి.సి.పి.ఎన్.డి.టి. క్రింద నమోదు చేసే కేసుల్లో నిందితులకు తప్పనిసరిగా కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిందితులకు శిక్ష పడే విధంగా అవసరమైన ఆధారాలు సేకరించాలని అన్నారు. సమావేశంలో పోలీసు కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూలి పి.సి. పి.ఎన్.డి.టి. చట్టం కట్టుదిట్టంగా అమలు చేసేందుకు పోలీస్ శాఖ తరపున సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి కేసు నమోదు చేసే సమయంలో వీడియో రికార్డింగ్ సాక్ష్యాలతో పట్టుకోవాలని అన్నారు. గతంలో తప్పులు జరిగిన ఆసుపత్రులు మరో పేరుతో నడిపించే అవకాశం ఉందని, అటువంటి వాటిపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ పీవో లు డా. చందు నాయక్, డా. సి. బిందు శ్రీ, డా. డి. రామారావు, డా. పి. వెంకట రమణ, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎం. నరేందర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. శంకర్, ఐఎంఏ ప్రెసిడెంట్ డా. ఎస్. రెహానా బేగం, డా. ఎస్. మంగళ, డా. జి. అపర్ణ, జాగృతి ఎన్జీవో ఎం. కుముదిని, డిసిపివో టి. విష్ణువందన, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

**పంటలను పరిశీలించిన డీఏవో**

**టీ మీడియా, అక్టోబర్ 07,సింగరేణి( కారేపల్లి) :**
ఆకాల వర్షాలతో పత్తి మొక్కలు ఎర్రబారటం, కాయ కుళ్లు వంటివి కనిపిస్తున్నాయని వాటి నివారణ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య అన్నారు. కారేపల్లి మండలం మాణిక్యారం ప్రాంతంలో మంగళవారం పత్తి చేలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు సూచనలు చేశారు. చేనులో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మొక్కకు పోషకాలు అందించటం ద్వారా నష్ట నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. యూరియా కొరత లేదని, కొరత పేరుతో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక నత్రజని వినియోగంతో పంటలకు చీడపీడలు అధికంగా సోకటంతో పాటు మానవుల ఆరోగ్య పరంగానే కూడా ఎంతో అనార్థమన్నారు. అనంతరం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతుల ఆధార్ కార్డులను పీవోఎస్ మిషన్ల లో నమోదు చేయటం ద్వారానే ఎరువుల అమ్మకం చేపట్టాలని డీలర్లకు సూచించారు. పంటల నమోదును తప్పని సరిగా చేసుకోవాలని, పత్తి అమ్మకానికి రైతులు కపాస్ కిసాన్ యాప్ ను వినియోగించాలని, దానిపై స్థానిక విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. రైతులకు అందుబాటులో అన్ని రకాల ఎరువులు ఉన్నాయని తెలియజేశారు. డీఏవో వెంట ఏవో బట్టు



అశోక్ కుమార్, ఏఈవోలు బీ.నరేష్, జీ.మహేశ్, ప్రమీల, మున్ని, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ మున్సిపాలిటీలో చెత్త సమస్య

**-వసూల్ ఫుల్.. అభివృద్ధి నిల్**

**టీ మీడియా ,అక్టోబర్7,మధిర:**ఇప్పటికే మధిర మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనుల వలన అస్తవ్యస్తంగా రోడ్లు.. పారిశుధ్యం చేసేవారు లేక రోడ్డు పక్కనే డంపింగ్ యార్డ చెత్తను పడేయడంతో దుర్గంధ భరితంగా కంపు కొడుతున్న వీధులు..లిమధిర మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో గత కొన్ని వారాలుగా చెత్తను స్వీకరించబడడంతో వీధులన్నీ చెత్తమయంతో దుర్గంధ భరితంగా కంపు కొడుతున్నాయి. మున్సిపాలిటీలోని పలు వార్డులోని ప్రజలు పారిశుధ్యం లోపించడం వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.. ఒకటో వార్డు చెత్త నందు చెత్త డ్రైనేజీ సమస్య, పారిశుద్యం లోపించడం వల్ల అనేకమంది డెంగ్యూతో బాధపడుతూ ఒకరిద్దరు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. అటువైద్య శాఖ నుండి తూతూ మంత్రంగా ఉచిత క్యాంపులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు మున్సిపాలిటీ అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడడం లేదు. మధిర పట్టణ నడి ఒడ్డు రామనాథం గారి హాస్పిటల్ , గర్ల్స్ హై స్కూల్ తదితర ప్రాంతాల్లో గత కొన్ని వారాలగా చెత్తను పారిశుధ్య కార్మికులు తీసివేయకపోవడం వల్ల వీధుల వెంట పేరుకుపోయి దుర్గంధ భరితంగా మారాయి.. గర్ల్స్ హై స్కూల్ పాఠశాలలో విద్యార్థులు ఈ దుర్గంధ భరితమైన గాలిని పీల్చుకోవడం వల్ల అనారోగ్య పాలవుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మధిర మున్సిపాలిటీ అధికారులు ఎప్పటికైనా స్పందించి మధిర మున్సిపాలిటీలో పలు వీధుల్లో పేరకపోయిన చెత్తను వెంటనే తొలగించే ప్రజల ఆరోగ్యాన్ని రక్షించవలసిందిగా కోరుతున్నారు.



## అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**టీ మీడియా ,అక్టోబర్7,మహబూబాబాద్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ రెవెన్యు అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏటీసీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు, పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అమలు అవుతున్న వివిధ కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీలో ఉన్న అధునాతన మిషనరీ గురించి వివరాలను సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్శనలో కలెక్టర్ వెంట మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్, ఏటిసి ప్రిన్సిపల్ ఎన్. బాబు ఏటిసి ఇంచార్జ్ ఉప్పలయ్య, రాజేశ్వర్ మరియు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## ట్రెక్కింగ్ లో సింగరేణి విద్యార్థుల ప్రతిభ

**టి మీడియా, అక్టోబర్ 7,పినపాక ప్రతినిధి:** తిరుపతిలో సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపులో మణుగూరు సింగరేణి పాఠశాల ఎన్ సి సి కేడెట్లు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దేశవ్యాప్తంగా 102 మంది పాల్గొన్న ఈ శిబిరంలో మణుగూరు పాఠశాల నుండి 8 మంది కేడెట్లు హాజరయ్యారు. శిబిరంలో కేడెట్లు తిరుపతి అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్ చేస్తూ ప్రకృతి సంరక్షణ, జట్టు సమన్వయం, సహన శిక్షణ అంశాలలో తర్ఫీదు పొందారు. సింగరేణి కేడెట్ శ్రీకృష్ణ కౌశిక్ గ్రూప్ డాన్స్ పోటీలో ప్రతిభ కనబరిచి బహుమతి గెలుపొందారు. తిరుపతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కేడెట్లకు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు మస్తానయ్య, ఎన్ సి సి ఆఫీసర్ రాజసింహ పాల్గొన్నారు.

## ప్రధాన న్యాయమూర్తిపై దాడి సరికాదు

**-మాజీ ఎంపీ నామ ఖండన**

**టి మీడియా, అక్టోబర్ 7, ఖమ్మం :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి సంఘటనను బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. న్యాయవ్యవస్థపై దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ తెస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలు సరికాదన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వంటి ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తిపై దాడి ప్రయత్నం జరగడం ఆందోళనకరమని నామ అన్నారు. ప్రజల న్యాయహక్కులను కాపాడే న్యాయమూర్తులపై దాడి ప్రయత్నం దేశ ప్రజాస్వామ్య గౌరవాన్ని దెబ్బతీసిన చర్యగా అభివర్ణించారు. దాడి యత్నం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. న్యాయమూర్తుల భద్రతను మరింత పటిష్టపరిచి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టడంలో ప్రభుత్వం, న్యాయవర్గాలు, ప్రజాసంఘాలు సమన్వయంతో ముందుకు రావాలని నామ పేర్కొన్నారు.



# వ్యాధులపై అవగాహన కల్పించాలి

**-వైద్యాధికారి డాక్టర్ మౌనిక**



**టీ మీడియా , అక్టోబర్7,మహబూబాబాద్:** కీటకజనిత వ్యాధుల నియంత్రణలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రై డే ప్రజలకు అవగాహన కల్పించాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మౌనికఅన్నారు.. మంగళవారం మహబూబాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించిన ఆశ డే కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి స్థానిక మున్సిపల్ సిబ్బంధి తో పూడ్చివేయాలని అన్నారు.జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రోజు రోజుకు ఆడ పిల్లల నిష్పత్తి చాలా తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ సమాజంలో స్త్రీ – పురుషులు ఇరువురు సమానమే అని స్త్రీ పురుషుల మధ్య ఏ వివక్షత ఉండకూడదని నిజానికి పురుషుడి కంటే స్త్రీ ఏ విషయంలోనూ తక్కువ కాదని అందుకే ఈనాడు అన్ని రంగాలలో స్త్రీలు, పురుషులతో పోటీ పడుతున్నారని అయినా మన సమాజంలో ఆడ శిశువులపట్ల అనాదరణ ఇంకా తగ్గలేదని పుట్టబోయేది ఆడ శిశువని తెలియగానే కొన్ని సందర్భాలలో గర్భస్రావానికి కొన్ని కుటుంబాలు సిద్ధపడుతున్నాయని అన్నారు. ముఖ్యం గా ఇంతకు ముందే ఆడ పిల్లలు వుండి మళ్ళీ గర్భం దాల్చిన వారిపైన నిఘా వుంచాలని, ఒకవేళ ఎవరైనా గర్భ విచ్చితికి పాల్పడినట్టైతే ఉన్నతాధికారులకు తెలియచేయాలని అటువంటి వారిని ప్రోత్సహించిన వారిపై కూడా 'గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ ప్రక్రియ (లింగ ఎంపిక నిషేద) చట్టం, 1994 ప్రకారం శిక్ష పడుతుందని అన్నారు.ఈకార్యక్రమం లో జిల్లా ఆశా నోడల్ ఆఫీసర్ శ్రీమతి సక్కుబాయి, ఆరోగ్య విద్యా బోధకులు కె.వి. రాజు, ఎంపిహెచ్ఈఓ తోట శ్రీనివాస్, సూపర్వైసర్ పుష్పలీల, పిడిఎంఓ లు, ఎంఎల్‌హెచ్‌పి లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సై పై ఫిర్యాదుకు రంగం సిద్ధం

**టి మీడియా, అక్టోబర్ 7,మహబూబాబాద్**

:మహబూబాబాద్ జిల్లా లోని మహబూబాబాద్ పట్టణంలోని ఉన్న ఒక ఎస్సై పై ఫిర్యాదు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్న బిజెపి నాయకులు ఒక పంచాయతీ విషయంలో మానుకోట పట్టణంలోని పోలీస్ స్టేషన్లో కి వెళ్లిన బిజెపి నాయకుడితో టౌన్ ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న ఒకరు వారితో దురుసుగా ప్రవర్తించి వారిని కించపరిచారని తెలియజేస్తూ టౌన్ ఎస్సై పై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్న బిజెపి నాయకులు.



## మహర్షి వాల్మీకి అందరికీ స్ఫూర్తిదాయకం

**టి మీడియా, అక్టోబర్ 7,పినపాక ప్రతినిధి:**మహర్షి వాల్మీకి జీవిత గాథ అందరికీ స్ఫూర్తిదాయకమని సింగరేణి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. మంగళవారం జిఎం కార్యాలయంలో ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జిఎం మాట్లాడుతూ, వాల్మీకి చిన్నతనంలో రత్నాకరుడు అనే పేరుతో దొంగతనాలకు పాల్పడుతున్న నేపథ్యంలో, ఒక సద్గురు మాటతో ఆయన జీవితాన్ని మార్చుకొని, అకుంఠిత దీక్షతో ఏండ్ల తరబడి తపస్సు చేసి వాల్మీకి మహర్షిగా అవతరించాడని తెలిపారు. ఆయన రచించిన శ్రీమద్ రామాయణం,24 వేల శ్లోకాలు, 6 ఖండాలు సంస్కృతి యొక్క మూల స్తంభాలుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.



## ఆదర్శ మహనీయుడు వాల్మీకి మహర్షి

**టీ మీడియా, అక్టోబర్ 7, ముదిగొండ :** రామాయణ సృష్టికర్త వాల్మీకి మహర్షి నేటి సమాజానికి ఆదర్శనీయుడని, వాల్మీకి మహర్షి ఆశయాలను అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని వాల్మీకి జయంతి సందర్భంగా ముదిగొండ తహసీల్దార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి చిత్ర పటానికి పూలువేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు తహసీల్దార్ సునీతా ఎలిజబెత్... ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి,ఆర్ఐ జానిమియా,రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హక్కుల కోసం కొమరం భీమ్ స్ఫూర్తితో పోరాటం

### కారేపల్లిలో ఘనంగా కొమరం బీమ్ వర్ధంతి

**టీ మీడియా, అక్టోబర్ 07, సింగరేణి (కారేపల్లి) :** ఆదివాసీలపై నిర్భంధాలు, వివక్షతపై మరో పోరాటానికి సమాయత్తం కావాలని తుడుందెబ్బ ఖమ్మం జిల్లా అధ్యక్షులు బచ్చల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కొమరం భీమ్ 85వ వర్ధంతిని కారేపల్లిలో ఘనంగా నిర్వహించారు. కారేపల్లి కొమరం భీమ్ సెంటర్‌లోని విగ్రహానికి, తుడుందెబ్బ కార్యాలయంలో కొమరం భీమ్ చిత్రపటానకి ఆదివాసీ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ అడవులపై ఆధారపడి జీవనంసాగిస్తున్న ఆదివాసీలపై నిర్భంధాలు విధిస్తుండటతో వారి అస్తిత్వానికి ప్రమాదం వచ్చిందన్నారు. రాజకీయ పక్షాలు ఓట్ల రాజకీయంతో ఆదివాసీలపై వివక్షత సాగిస్తున్నారని దీనిపై కొమరం భీమ్ స్ఫూర్తితో ఐక్య పోరాటాలతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్తీ రాంప్రసాద్, కార్యదర్శి ఈసాల రాంబాబు, మాజీ సర్పంచ్‌లు కుర్సం సత్యనారాయణ, సాగబోయిన వెంకటమ్మ, తుడుందెబ్బ మండల నాయకులు యదళ్లపల్లి శీను, తాటి రామారావు, దారం సహదేవులు, ఈసాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యం పై జరిగిన దాడి

**-గుగులోత్ కిషన్ నాయక్**

**టీ మీడియా , అక్టోబర్ 7, మహబూబాబాద్:** భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గావాయి మీద సుప్రీం కోర్టు ఆవరణలో బూటుతో దాడి చేయడం అమానుష చర్య. ఈ ఘటన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన ఘటన కాదు ఇది రాజ్యాంగం మీద న్యాయ వ్యవస్థ మీద ప్రజాస్వామ్యం పై జరిగిన దాడిగా భావిస్తున్నాం అని భారతదేశానికి దిశా దశ న్యాయవ్యవస్థ అందించే చీఫ్ జస్టిస్ మీద దాడి జరిగిందని సామాన్య మధ్యతరగతి వర్గాలకు పీడిత శ్రామిక వర్గాలకు న్యాయం ఎక్కడ జరుగుతుంది అని బేషరతుగా దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి కోర్టు నుండి బహిష్కరించాలి బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంలో హక్కులను సక్రమంగా అమలు చేయక రాజ్యాంగం కాలరాస్తూ సనాతన ధర్మాన్ని ప్రోత్సహిస్తూ రాజ్యాంగ విలువలను కాలరాయడం శోచనీయం అని ప్రజాస్వామ్యము రక్షించుకొనుటకు రాజ్యాంగంలో హక్కులు చట్టములను అమలు కోసం పోరాటం చేయాలని ప్రజాస్వామ్యవాదులు మేధావులు ఖండించాలని కిషన్ నాయక్ డిమాండ్ చేశారు.